క్లుప్తంగా

కోత దశకు వరి పంట



మునగపాకలో కోత దశలో ఉన్న వరిపైరు

మునగపాక: మండల వ్యాప్తంగా వరిపైరు ఆశాజనకంగా ఉంది. వాతావరణం అనుకూలించడంతో ఈ సంవత్సరం కోత దశకు చేరుకుంది. మునగపాక, తిమ్మరాజుపేట, పాటిపల్లి, అరబుపాలెం, నాగులాపల్లి, చూచుకొండ తదితర చోట్ల ప్రస్తుతం వరి పైరు కోత దశలో ఉంది. ఇప్పటికే కొన్నిచోట్ల కోతలు చేయగా.. మరికొన్ని చోట్ల వారం నుంచి పది రోజుల్లోగా కోతలు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ ఏడాది పెట్టుబడులకు ఢోకా లేదంటూ పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

జేవీ పాలెంలో కాలువ పనుల అడ్డగింత



కాలువ తవ్వకాలను అడ్డుకుంటున్న రైతులు

ఎస్.రాయవరం: జేవీ పాలెం గ్రామంలో పొలాలకు ఆనుకుని తవ్వుతున్న కాలువ పనులను స్థానిక రైతులు గురువారం అడ్డుకున్నారు. కూటమి నేత శంకర్రావు ఆదేశాల మేరకు కాలువ తవ్వి మట్టిని తరలిస్తున్నామని సిబ్బంది చెబుతున్నారు. అసలు ఈ కాలువ వల్ల ప్రయోజనం చేకూరకపోగా, పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువ పనులు అని చెప్పి, తవ్విన మట్టిని విక్రయించుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాలువ తవ్వకాలకు పంచాయతీ నుంచి నిధులు కేటాయించినట్టు చెబుతున్నా.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. పంట పొలాలకు నష్టం చేకూర్చే కాలువను తవ్వొద్దని అంటూ రైతులు అడ్డగించడంతో పొక్లెయిన్ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఎన్‌పీసీఐ సర్వే త్వరగా పూర్తి చేయాలి



పాల్తేరు సచివాలయంలో ఎన్‌పీసీఐ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు

పాయకరావుపేట: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ బ్యాంకు అకౌంట్ కలిగి ఉండాలని ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వం ఎన్‌పీసీఐ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. ఈ మేరకు ఎంపీడీవో జయప్రకాష్‌రావు గురువారం పాల్తేరు, ఈదటం గ్రామ కార్యదర్శుల పనితీరును పరిశీలించి, తగు సూచనలు, సలహాలు అందించినట్లు ఈవోఆర్డీ తెలిపారు.

నాలుగేళ్లుగా పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్



అరెస్ట్ చేసిన వ్యక్తితో సీఐ అప్పన్న

పాయకరావుపేట: గత నాలుగేళ్లుగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ జి.అప్పన్న తెలిపారు. మండలంలోని చిన నర్సాపురం గ్రామానికి చెందిన గుడాల అజయ్ కుమార్‌పై పోక్స్, మిస్సింగ్ కేసులు నమోదై ఉన్నాయి. తప్పించుకు తిరుగుతున్న ఆయనను పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి ఎట్టకేలకు పట్టుకున్నారు. రిమాండ్ నిమిత్తం యలమంచిలి కోర్టులో హాజరు పరిచి, మెజిస్ట్రేట్ ఉత్తర్వులు మేరకు విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

కొనసాగుతున్న అయ్యప్పస్వాముల భిక్ష



ఆలయ ప్రాంగణంలో భిక్ష చేస్తున్న స్వాములు

మునగపాక: మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భిక్ష సదుపాయం కొనసాగుతోంది. భక్తుల విరాళాలతో ఆలయ కమిటీ సభ్యులు గత నెలలో ఉచిత భిక్ష సదుపాయాన్ని స్వాముల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గురువారం నాటికి 37వ రోజుకు చేరుకుంది. మాలలు ధరించిన భక్తులు రోజూ భిక్షను స్వీకరిస్తున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
✆ 7331100207, 7997958344

రైతుల కన్నీటి వ్యధ



శ్రమదానంతో పెనుగొల్లు గ్రోయిన్‌కు అడ్డుకట్ట వేసుకుంటున్న ఆయకట్టు రైతులు

- వరదలకు శిథిలమైన గ్రోయిన్లు
- వృథాగా పోతున్న వరాహనది నీరు
- పంట పొలాలకు అందని సాగునీరు

ఎస్.రాయవరం: సాగునీటి కోసం రైతులకు అవస్థలు తప్పడం లేదు. వర్షాలు సకాలంలో పడినా నీటి నిల్వలకు అవకాశం లేకపోవడంతో ఏటా సమస్య ఎదురవుతోంది. నదుల్లో ఏర్పాట్లు చేసిన గ్రోయిన్లు దెబ్బతి



దెబ్బతిన్న మూలపాలెం గ్రోయిన్, కోతకు గురైన వరాహ నది గట్టు

నడంతో నీరు వృథాగా కిందకు పోతోంది. ఎస్.రాయవరం మండలంలో గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టి 15 ఏళ్లు గడుస్తోంది. మండలంలో ఎక్కువ శాతం వర్షాధారం కావడంతో వరాహనది ప్రవాహం ఉన్నప్పుడే ఖరీఫ్ సీజన్‌లో మాత్రమే సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తుంటారు. అయితే నదిలో ఉన్న గ్రోయిన్లు శిథిలమైపోవడంతో వర్షాలకు నదిలో ప్రవహించే నీరు దిగువకు వృథాగా పోతోంది. దీంతో పంట పొలాలకు అవసరమైన సమయంలో సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. గడిచిన 15 ఏళ్లుగా వరదల తాకిడికి దెబ్బతిన్న గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో సాగునీరు కలగా మారింది. కొన్ని గ్రోయిన్ల వద్ద రైతులు శ్రమదానంతో తాత్కాలిక అడ్డుకట్టలు వేసుకుని నీటిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. ఆ సమయంలో నదిలో నీటి ఉధృతి పెరిగితే తాత్కాలిక కట్టు వెంటనే కొట్టుకుపోతుంది. ఇలా రైతులు పంటల సాగుకు అష్టకష్టాలు పడుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

మండలంలో గ్రోయిన్లు దెబ్బతిన్నాయన్న విషయం వాస్తవమే. అయితే ప్రతి ఏడాది మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపుతున్నాం. నిధులు విడుదల కాలేదు. తాజాగా సెప్టెంబర్‌లో వచ్చిన వరదల్లో మరోమారు జమ్మీ కాలువ గ్రోయిన్‌కు రూ.40 లక్షలు, పెనుగొల్లుకు రూ.57 లక్షలు, పెదఉప్పలంలో రూ.64 లక్షలు, కొరుప్రోలు రూ.25 లక్షలు, మూలపాలెం గ్రోయిన్ వద్ద మినీ ఆనకట్టకు రూ.39 కోట్లు మేర అంచనా వేస్తూ ప్రతిపాదన పంపించాం. నిధులు విడుదలైతే వచ్చే వేసవిలో పనులు చేపడతాం.

– భాను, ఇరిగేషన్ ఏఈ, ఎస్.రాయవరం మండలం

మండలంలో ఇదీ పరిస్థితి

మండలంలో వరాహ నది గ్రోయిన్లు, కాలువలపై ఆధారపడి సుమారు 24 వేల ఎకరాలు సాగవుతోంది. ఇందులో కొబ్బరి 7 వేలు, జీడి మామిడి 2 వేలు, వరి 10 వేలు, ఇతర అరటి, తమలపాకు, కూరగాయలు, సరుగుడు తదితర పంటలు 5 వేలు ఎకరాల్లో సాగులో ఉన్నాయి. కేవలం మరమ్మతులకు గురైన గ్రోయిన్ల పరిధిలో 9,500 ఎకరాలు ఆయకట్టుకు సుమారు 15 సీజన్లుగా నీరందడం లేదంటే పరిస్థితి అర్థం **చేసుకోవచ్చు. జమ్మీకాలు పరిధిలో 1800 ఎకరాలు, మూలపాలెం** గ్రోయిన్ పరిధిలో 850 **ఎకరాలు, పెనుగొల్లు** గ్రోయిన్ కింద 1200 **ఎకరాలు, పెదఉప్పలం** గ్రోయిన్‌లో 2000 ఎక**రాలు, కొరుప్రోలు** గ్రోయిన్ కింద 1200 ఎక**రాలు చొప్పున ఆయ**కట్టు ఉంది. వీరంతా గత **15 ఏళ్లుగా వరదలు** వచ్చి నది ప్రవాహం **ఉప్పొంగి ఆయా** గ్రామాల్లో చెరువులు నిండితే **సాగుకు సిద్ధం అవు**తున్నారు. ఈ సమస్యలు **ఎదుర్కొనలేక కొందరు** రైతులు సాగుకే దూర**మవుతున్న పరిస్థితు**లు ఉన్నాయి. ఇప్పటికైనా **గ్రోయిన్ల మరమ్మతు**లకు నిధులు విడుదల **చేసి, సాగునీటి సమ**స్యను పరిష్కరించాలని **రైతులు కోరుతున్నారు.**

గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టాలి



గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో చాలా పంటలకు సాగునీరు అందడం లేదు. సీజన్‌లో వర్షాలు కురిసినా గ్రోయిన్లు శిథిలావస్థలో ఉండడంతో దిగువకు నీరు పోతోంది. శ్రమదానంతో అడ్డుకట్ట వేసుకున్నా ఫలితం ఉండడం లేదు. ఈ ఏడాదైనా మరమ్మతులు చేపట్టాలి.

– బాలం సూరిబాబు, ఎంపీటీసీ, వమ్మవరం

త్వరితగతిన ఇళ్ల వివరాలు కంప్యూటరీకరణ



సచివాలయంలో కంప్యూటీకరణ పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో మూర్తి

పాయకరావుపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న గృహాల వివరాలను త్వరితగతిన కంప్యూటరీకరించాలని నర్సీపట్నం డీఎల్‌పీవో ఎస్ఎస్ఎస్ఎన్ మూర్తి గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. ప్రతి ఇంటి వివరాలు గతంలోనే సేకరించామని, వాటి వివరాలు, విస్తీర్ణం, పన్నుల వివరాలు, ఖాళీ స్థలం తదితర అంశాలు నమోదు చేయాలన్నారు. ఈ మేరకు ఆయన గురువారం పాయకరావుపేట, పీఎల్‌పురం పంచాయతీలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఆయా గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాలను అభివృద్ధి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్, ఆయా గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: మండలంలోని పురుషోత్తపురం 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధి పేరంటాళ్లపాలెం, పీఎస్ఆర్ పేట ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. యలమంచిలి మండలం పురుషోత్తపురం, పీఎస్ఆర్ పేట, బయ్యవరం, పులపర్తి గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఖైదీలకు సత్ప్రవర్తనపై కౌన్సెలింగ్ ఇవ్వాలి

సబ్‌జైల్ తనిఖీ చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ



సబ్‌జైల్‌లో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ

యలమంచిలి రూరల్: రిమాండ్ ఖైదీలకు సత్ప్రవర్తనపై న్యాయవాదులు కౌన్సెలింగ్ ఇవ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ సూచించారు. గురువారం యలమంచిలి సబ్‌జైల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న 14 మందితో ఆమె మాట్లాడారు. వారంతా ఏయే కేసుల్లో నేరారోపణలు ఎదుర్కొంటున్నారో అడిగి తెలుసుకుని వారికి అవసరమైన న్యాయ సలహాలు ఇచ్చారు. పేనల్ న్యాయవాదులు తరచూ ఉప కారాగారాన్ని సందర్శించి ఖైదీలతో మాట్లాడి, వారు జైలు నుంచి బయటకు వెళ్లాక నేర ప్రవృత్తికి దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. మీరంతా క్షణికావేశంలో తెలిసో, తెలియకో చిన్న నేరాలు చేసి ఉంటారని, చేసిన తప్పును తెలుసుకుని, భవిష్యత్తులో అలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆమె సూచించారు. మీరు జైలుకు రావడం వల్ల మీ కుటుంబ సభ్యులు, పిల్లలు సమాజంలో చులకనవుతారన్నారు. న్యాయవాదిని నియమించుకునే స్తోమతలేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదిని నియమించనున్నట్లు తెలిపారు. అనంతరం జైలు పరిసరాలు, ఖైదీలకు వడ్డించే ఆహారం, సదుపాయాలు, ఆరోగ్య పరిస్థితుల గురించి విచారించారు. ఈ కార్యక్రమంలో జైలు పేనల్ లాయర్లు పి.వి.రమణ, బి.హరిశంకర్రావు, టి.నూకరాజు, కె.ఎస్.దుర్గాప్రసాద్, పి.సుభాషిణి, ఉపకారాగారం పర్యవేక్షకుడు ప్రసాద్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

సంప్రదాయ వైద్యంపై దృష్టి సారించాలి



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: సంప్రదాయ వైద్యంపై ప్రజలు మక్కువ చూపాలని తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు కోరారు. మునగపాక రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి నిరంతర ఔషధ విజ్ఞాన సదస్సును ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషధ మొక్కలతో తయారు చేసే మందుతో చాలా రోగాలు నయమవుతాయన్నారు. ఎటువంటి దుష్ఫలితాలు కూడా ఉండవన్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఆయుర్వేద వైద్యులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సహజ సిద్ధంగా తయారు చేసిన పలు రకాల పదార్థాలను కొనుగోలు చేసేందుకు పోటీ పడ్డారు. వైద్యులు అలుగోలు ప్రసాదరావు పర్యవేక్షణలో పరంపర్య వైద్య మహా సంఘం తిరుపతి, గురూజీ మూలికా వైద్య సమాఖ్య సంయుక్త నిర్వహణలో ధన్వంతరి జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు విజయానంద స్వామీజీ, వి.బాలకృష్ణ, అల్లక రాజు, సుధారాణి, శ్రీనివాస్, యాత్రి మహర్షి, సజ్జన రమేష్, బాలనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీకే ఎరువుల విక్రయాలు


- అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు
- నర్సీపట్నం వ్యవసాయ సహాయక సంచాలకురాలు శ్రీదేవి
- రాంబిల్లి మండలంలో ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



దిమిలిలో ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న నర్సీపట్నం వ్యవసాయ సహాయక సంచాలకులు టి.శ్రీదేవి

రాంబిల్లి(యలమంచిలి): ఎంఆర్‌పీకే ఎరువులు, పురుగు మందులు విక్రయాలు చేపట్టాలని నర్సీపట్నం వ్యవసాయ సహాయక సంచాలకురాలు టి.శ్రీదేవి స్పష్టం చేశారు. ఆమె గురువారం రాంబిల్లి మండలం దిమిలి, మురకాడ, కట్టుబోలు గ్రామాల్లో ఉన్న ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో రికార్డులు, లైసెన్సులు, బిల్ బుక్‌లు, ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులను, పురుగు మందులను ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల నిల్వలను బ్లాక్ బోర్డుపై రాసి సూచించాలన్నారు. దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు. ఫెంగల్ తుఫాన్ కారణంగా రానున్న 2 రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. రబీలో పంటల బీమా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి సి.హెచ్.సుమంత, తదితరులు పాల్గొన్నారు.

జీవోలు, యాప్‌లతో ఉపాధ్యాయులపై ఒత్తిడి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు

ఎస్.రాయవరం: ప్రభుత్వం విడుదల చేస్తున్న జీవోలు, నమోదు చేయమంటున్న యాప్‌ల కారణంగా ఉపాధ్యాయులు ఒత్తిడితో పని చేయాల్సి వస్తోందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కె.ఎల్.ఎస్.ధర్మారావు, ఎస్.దుర్గాప్రసాద్ తెలిపారు. గజపతినగరంలో గురువారం లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసరావు గుండె పోటుతో మరణించారు. ఈ మేరకు వారు విలేకరులతో మాట్లాడుతూ శ్రీనివాసరావు ఆత్మశాంతి చేకూరాలని కోరుతూ ఒత్తిడితో కూడిన పనుల వల్ల ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురికి పైగా ఇలా మృతి చెందారన్నారు. స్థానికంగా అందుబాటులో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. జీవో నంబర్ 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే

- మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు
- చంద్రబాబు పాలనపై ధ్వజం



జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం: బీసీ, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉన్న వ్యక్తి మహాత్మా జ్యోతిరావుపూలే అని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా అడ్డురోడ్డులోని క్యాంపు ఆఫీసులో పూలే చిత్ర పటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయాలపై జోగులు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇది మంచి ప్రభుత్వం అని చెప్పుకునే చంద్రబాబుకు పరిపాలనలో మంచి ఎక్కడ ఉందో చెప్పాలన్నారు. అంతా మోసమేనని, అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు వాటిని అమలు చేయలేక గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. కుట్రలు, అరాచకం, దాడులు, ఎక్కడిక్కడ ఇసుక దోపిడీ, అన్నింటా వైఫల్యాలు కనిపిస్తున్నాయన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఇలా అన్ని వర్గాలను మోసం చేశారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి, భద్రతలు పూర్తిగా క్షీణించాయని, 16,437 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. అసలు అమలులో లేని ల్యాండ్ టైటిల్‌యాక్ట్‌ను రద్దు చేశారని ఎద్దేవ చేశారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం రూ.15 వేల కోట్ల రుణం ఇప్పిస్తామని కేంద్రం గొప్పగా ప్రచారం చేసుకుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ మెంబర్ కొణతాల శ్రీనివాసరావు, గుడివాడ సర్పంచ్ దూళి శ్రీనివాసరావు, తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ, గుర్రాజుపేట మాజీ సర్పంచ్ మధువర్మ, పార్టీ నాయకుడు పొలుమూరు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యలమంచిలి ఎంపీపీ గోవింద్, అధికారులు

యలమంచిలి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ బోదెపు గోవింద్, ఎంపీడీవో కొండలరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గుప్త, బెజవాడ నాగేశ్వరరావు.. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను వివరించారు. నిరుపేద విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలన్న ఉద్దేశంతో గురుకులాల స్థాపనకు శ్రీకారం చుట్టిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ దీపిక, ఏఈ సోమశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లి త్రినాథ్, పిట్టా సత్తిబాబు, రాపేటి సంతోష్, సుంకర మరిడేశ్వరరావు, కాళ్ల సీతారాం, వేల్పుల శేఖర్ బాబు, దూది నర్సింహమూర్తి, పాల్గొన్నారు.

104 వాహనం సరే.. సిబ్బందెక్కడ?



వైద్యులు, సిబ్బంది లేకుండా పేటసూదిపురంలో ఉన్న 104 వాహనం

ఎస్.రాయవరం: గ్రామాల్లో ప్రతి వారం 104 వాహనం ద్వారా అందే వైద్యంపై పర్యవేక్షణ కొరవడింది. సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలో పేటసూదిపురం గ్రామంలో గురువారం జరిగిన సంఘటనే అందుకు నిదర్శనం. పీహెచ్‌సీ పరిధిలో రోజుకొక గ్రామంలో 104 సేవలు అందించేందుకు వాహనంతో వైద్యులు, సిబ్బంది వెళ్తారు. అయితే గురువారం పేటసూదిపురం గ్రామానికి వైద్య సిబ్బంది, వైద్యులు మధ్యాహ్నం వరకు ఉండి, మధ్యాహ్నం 104 వాహనం డ్రైవర్, ఆ గ్రామ ఆశా కార్యకర్తకు అప్పగించి వెళ్లిపోయారు. మధ్యాహ్నం నుంచి వచ్చిన రోగులకు తనకు తెలిసిన మందులను ఆశా కార్యకర్త ఇచ్చి పంపించేసింది. తనకు అవగాహన లేకపోతే డాక్టర్ లేరు తరువాత రండి అని పంపించేయడంతో రోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో వైద్య సేవలపై నిర్లక్ష్యం తగదని హెచ్చరిస్తున్నారు.

నక్కపల్లిలో నేడు ప్రజాదర్బార్

తుమ్మపాల: ఈ నెల 29న ఉదయం 8 గంటలకు నక్కపల్లి మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో పాయకరావుపేట నియోజకవర్గ స్థాయి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. హోంశాఖ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మంత్రి వంగలపూడి అనిత హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. 'ప్రజాదర్బార్'కు జిల్లా అధికారులందరూ పాయకరావుపేట నియోజకవర్గానికి సంబంధించిన తమ శాఖలోని మండల, డివిజనల్ స్థాయి అధికారులతో కలిసి స్వయంగా హాజరు కావాలని పేర్కొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులపై దృష్టి

మునగపాక: గ్రామాల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు కోరారు. మునగపాకలోని జనసేన కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రహదారులు, కాలువల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. జనసేన మండల కన్వీనర్ పరశురామ్, కూటమి నేతలు ఏవీ సత్యనారాయణ, కాళ్ల చంద్రమోహన్, వేగి కృష్ణ, అల్లవరపు రమణబాబు, రాజశేఖర్ పాల్గొన్నారు.

2న విశాఖ డెయిరీ ముట్టడి



అచ్యుతాపురం మండలంలో పాల రైతులతో మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

అచ్యుతాపురం: తగ్గించిన పాల సేకరణ ధరను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 2న విశాఖ డెయిరీని ముట్టడించనున్నట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కన్వీనర్ సోమునాయుడు తెలిపారు. మండలంలోని జంగులూరు, భోగాపురం గ్రామాల్లో గురువారం వారు పాడి రైతులతో మాట్లాడారు. గత నెల 29న డెయిరీ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేసి, ఉత్తరాంధ్రలోని ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు.

మునగపాక: పాడి రైతుల సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 2న తలపెట్టిన విశాఖ డెయిరీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముర్రాపు సూర్యనారాయణ కోరారు. మునగపాకలో గురువారం రాత్రి పాడిరైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఆవు పాల సేకరణ ధర తగ్గించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, జిల్లా నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హెచ్‌ఎం మృతికి కొవ్వొత్తులతో నిరసన



అచ్యుతాపురం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ శాఖ సభ్యులు

అచ్యుతాపురం: విజయనగరం జిల్లాలో శిక్షణ తరగతులకు హాజరైన ఓ ప్రధానోపాధ్యాయుడు మృతి చెందడాన్ని నిరసిస్తూ అచ్యుతాపురం మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద గురువారం ఆందోళన చేశారు. కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ పద్ధతిలో కాకుండా నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో గానీ, వేసవి సెలవుల్లో గానీ, ఆన్‌లైన్‌లో గానీ శిక్షణ ఇవ్వాలని గతంలో విజ్ఞప్తి చేసినప్పటికీ సంబంధిత శాఖ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, మండల అధ్యక్షుడు నానాజీ, ప్రధాన కార్యదర్శి సుభాషిణి, రవి కుమార్, కొండబాబు, స్వర్ణ, ప్రసన్న, జి.ఎస్.ప్రకాశ్, మారిశెట్టి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఏవో మోహనరావు

యలమంచిలి రూరల్: స్థానిక వ్యవసాయశాఖాధికారి కార్యాలయంలో గురువారం సమాచార హక్కు చట్టంపై సచివాలయాల పరిధిలో పని చేస్తున్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, అభ్యుదయ రైతులకు అవగాహన కల్పించారు. ఏవో పి.మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆర్‌టీఐ యాక్ట్ 2005 గురించి వివరించారు. పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఆర్‌టీఐ చట్టం ద్వారా పౌరులు అడిగిన సమాచారాన్ని అధికారులు 30 రోజుల్లో అందించాలని చెప్పారు. సెక్షన్ 4(1) ప్రకారం అధికారులు సమాచారానికి సంబంధించి అన్ని రికార్డులు, రిజిస్టర్లు నిర్వహించాలని చెప్పారు. సెక్షన్(5) ప్రకారం పీఐవో, ఏపీఐవో నియామకాలు జరుపుతారని, సెక్షన్ 6(3) ప్రకారం సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలన్నారు. ఈ సదస్సులో వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖాధికారులు, మండల అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.